క్లుప్తంగా

నేడు సన్నబియ్యం పంపిణీ

శాయంపేట : మండల కేంద్రంలోని రేషన్‌షాప్ నంబర్ 19లో నేడు (సోమవారం) రేషన్‌కార్డు లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏరుకొండ రజనీ-రవీందర్ గౌడ్ దంపతులు ఆదివారం మూడు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. వీరిని ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి అభినందించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు అధ్వర్యంలో ఏప్రిల్ 4న పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీఐ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జాబ్‌మేళాలో పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిరుద్యోగులు తమ పేర్లను పోలీస్‌స్టేషన్ వాట్సాప్ నంబర్ 87126 85019 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి జాబ్‌మేళాలో త్వరగా టోకెన్ ఇచ్చే విధంగా ఆత్మకూరు పోలీసులు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

కళాకారులకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలి

గీసుకొండ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని తమ ఆట, పాటల ద్వారా ముందుకు తీసుకుని వెళ్లిన కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకురాలు ఎర్రాల స్వప్న కోరారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 550 మంది కళాకారులకు మా త్రమే ఉద్యోగాలు ఇచ్చిందని, టీపీసీసీ ఎన్ని కల మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలివ్వాలని విన్నవించారు

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలో కంచి కరుణాసాగర్ నిల్వ చేసిన రూ.72,100 విలువైన గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ వివరాలు వెల్లడించారు. కరుణాసాగర్ అమ్మకానికి ప్రయత్నిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

అమ్మవారికి బోనాలు



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో ముదిరాజ్ కులస్తులు ఆదివారం పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ముదిరాజ్ కులస్తులు ఉదయం నుంచే ఆలయం వద్ద కుటుంబ సమేతంగా తరలివచ్చి పూజలు చేశారు. పలు కులాల ప్రజలు సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

విశిష్ట సేవలకు సన్మానం



కాజీపేట అర్బన్: సమాజానికి విశిష్ట సేవలందించిన వ్యక్తులకు ఉగాది పండుగ సందర్భంగా సన్మానించడం ఆనందంగా ఉందని మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా నగర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురిని సన్మానించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, పరకాల, కమలాపూర్, శాయంపేట, దామెర, ఆత్మకూరు, వేలేరు, ఐనవోలు మండలాల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే లేచి తలంటు స్నానాలు ఆచరించి సమీప ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఇళ్లలోని గుమ్మాలు మామిడితోరణాలతో కొత్త శోభ సంతరించుకున్నాయి. ఒగరు, తీపి, పులుపు, చేదుతో కూడిన ఉగాది పచ్చడి, ప్రీతివంటకమైన భక్ష్యాలను కుటుంబ సమేతంగా ఆరగించిన ప్రజలు సాయంత్రం వేళ సమీప దేవాలయాల వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా వర్షాలు సంవృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండి పంటలు బాగా పండుతాయని రైతులకు, ప్రజలకు అన్ని శుభాలు చేకూరనున్నాయని పండితులు పంచాంగంలో వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



దామెర : పంచాంగ శ్రవణం చదువుతున్న రాజుశర్మ



శాయంపేట : రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



కమలాపూర్ : పంగిడిపల్లిలో పంచాంగ పఠనం చేస్తున్న వేద పండితుడు



వేలేరు : గట్టుమల్లన్న ఆలయంలో పంచాంగ శ్రవణం వింటున్న భక్తులు



ఐనవోలు : పంచాంగ శ్రవణం చేస్తున్న మధుకర్ శర్మ



ఆత్మకూరులో..

బీరన్నకు మొక్కులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని కురుమ కులస్తుల ఆరాధ్య దైవం అయిన బీరన్న దేవుడికి ఆదివారం కురమ కులస్తులు డోలు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి మొక్కులు సమర్పించారు. ప్రతి సంవత్సరం చేసిన విధంగానే ఉగాది పచ్చడిని బీరన్న ఆలయం ప్రాగణంలో చేసుకొని సేవించారు. కార్యక్రమంలో కురుమ కులస్తులు అమ్మ అశోక్, సవాసి రమేష్, అమ్మ రాజు, తిరుపతి, ముజిగిరి వేణు, తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల పూజలు

గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వర, సురమాంబ దేవతలు, ఎల్లమ్మతల్లికి విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కొప్పుల, గంగిరేణిగూడెం గ్రామాల్లోని గౌడ కులస్తులు తాటి ముంజలు, ఉగాది పచ్చడితో మొక్కులు చెల్లించారు. కులపెద్ద గండి చేరాలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉగాది రోజు కంఠమహేశ్వరునికి ఘనంగా పూజలు నిర్వహించడం గౌడ కులస్తుల ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో పోశాల ఓదేలు, కల్లెపు సుదర్శన్, బొడిగె కొమురయ్య, కొప్పుల, గంగిరేణిగూడెం మాజీ సర్పంచ్ పోతు కృష్ణమూర్తి, తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా నాయకులు ఎండీ.పాషా, మాజీ ఎంపీటీసీ మైదం రవి, వంగాల జనార్ధన్, మురళి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



కంఠమహేశ్వరునికి పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

శ్రీరామనవమి వేడుకలను జయప్రదం చేయాలి

దామెర : శ్రీరామ నవమి వేడుకలను జయప్రదం చేయాలని దామెర ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి గంగిడి శ్రీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 6న శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఉదయం శ్రీరామచంద్రుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాల ని కోరారు. ఆలయ ప్రధాన అర్చకులు గుమ్మడవెల్లి సుబ్బయ్య శర్మ, శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, సత్యవర్ధన్ రెడ్డి, అనిల్ రెడ్డి, కృష్ణమూర్తి, భిక్షపతి, పోశాలు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనాచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఆదివారం నిర్వహించారు. విశేష అలంకరణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కలిగించారు. సాయంత్రం 6గంటలకు ఉగాది నూతన సంవత్సరం పంచాంగ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణధికారి కే.శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి



శాంతిర్యాలీ నిర్వహించి నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

కమలాపూర్: క్రైస్తవులపై జరుగుతున్న దాడులు వెంటనే అరికట్టాలని పాస్టర్లు, క్రైస్తవులు డిమాండ్ చేశారు. ఏపీలో పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి పట్ల నిరసనగా ఆదివారం మండల పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై కాసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో పాస్టర్లు, క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రైస్తవులు ఐక్యంగా ఉండి తమపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలన్నారు. ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు. ఈ శాంతి ర్యాలీలో మండలంలోని పలువురు పాస్టర్లు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా శానిటేషన్ వాహనం

పరకాల : లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన శానిటేషన్ వాహనం మరమరమ్మతుకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. రెండేళ్ల క్రితం రూ.85 లక్షలతో కొనుగోలు చేసిన వాహనం మూడు నెలల క్రితం రిపేరుకు వచ్చింది. మున్సిపల్ వద్ద ఎలాంటి నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేయించలేదు. దీంతో ప్రధాన రహదారులపై చెత్త, చెదారం పేరుకపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు రోడ్లపై పేరుకపోయిన దుమ్ము వాహనదారుల కళ్లలో పడుతూ తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు మున్సిపల్ శానిటేషన్ వాహనానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న శానిటేషన్ వాహనం

పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- నూరారంలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- వెదజల్లుతున్న దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న కాలనీల ప్రజలు

ఎల్కతుర్తి : నిత్యం గ్రామస్తులతో రద్దీగా ఉండే ప్రదేశాలు.. ఆ ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని సూరారం గ్రామంలో 4, 5, 6 వార్డులతో పాటు మరిన్ని వార్డుల్లోని మురికి కాల్వలో తీసిన చెత్త రోడ్డు పక్కనే, అలాగే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రక్కనే రోడ్డు సమీపంలో ఉన్న స్థలంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. పలు కాలనీల్లోని మురికి కాల్వల్లో పిచ్చి మొక్కలు పెరిగి ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి ఆ ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామంలో నలుగురు పారిశుద్ధ్య కార్మికులు ఉండగా ఒకరు ఇటీవల మృతి చెందగా మిగతా ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారు సైతం పట్టించుకోకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి గ్రామంలోని పలు వీధులు అస్తవ్యస్థంగా మారా యి. గ్రామంలోని పలు కాలనీల వాసులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు వేదిక సమీపంలో అధికంగా చెత్తాచెదారం పేరుకుపోయి నెల రోజులు గడుస్తున్నా అది తొలగించకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. అలాగే గ్రామ పంచాయతీ సమీపంలోని ఓ కిరాణం షాపు ఎదురుగా మురికికాల్వలో చెత్తా చెదారం అధికంగా పేరుకుపోయింది. గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరడం లేదని ఆరోపలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో గ్రామంలోని పలు కాలనీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బందితో పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారంను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామ అభివృద్ధిని పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా తగు చర్యలు చేపట్టాలని పలువురు నాయకులు కోరుతున్నారు.



సూరారంలోని 5వార్డు తుర్కకాలనీ నుంచి గొల్లవాడలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ఆరో వార్డులో పెరిగిన పిచ్చిమొక్కలు



గ్రామ పంచాయితీ సమీపంలోని డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్తా, చెదారం

వైభవంగా పెద్దమ్మతల్లి జాతర

- అధిక సంఖ్యలో తరలొచ్చిన భక్తులు
- మొక్కులు చెల్లించుకున్న మంత్రి సురేఖ
- ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్లు

ఖిలా వరంగల్: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పెద్దమ్మతల్లి జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. తూర్పుకోట ప్రాంతంలో చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల కాలం నాటి పెద్దమ్మతల్లి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, పూజారి హంస పెద్దులు ఆధ్వర్యంలో దుర్గామాతకు ఉదయం శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకుని పూజలు చేశారు.

భారీగా తరలొచ్చిన ప్రజలు

నగరం చుట్టూ ఉన్న 20 గ్రామాల ప్రజలు ఎడ్లబండ్లు, కార్లు, ద్విచక్ర వాహనాలను వివిధ ఆకృతులతో అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి సాయంత్రం చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బోగి సురేష్, మత్స్యకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంగరబోయిన చందర్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతరకు పోటెత్తిన భక్తులు

నగరంతోపాటు విలీన గ్రామాలు, పలు మండలాలకు చెందిన భక్తులు వందలాదిగా తరలివచ్చి పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం, రహదారులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఏసీపీ నందిరామ్ నాయక్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ సంగరబోయిన చందర్, బోగి సురేష్, నాయకులు అచ్చ విద్యాసాగర్, వీరేష్‌బాబు, సిరబోయిన వాసుదేవ్, మోలుగూరి ప్రమోద్, అర్షం రాంబాబు, సిరబోయిన శ్రీనివాస్, బొలుగొడ్డు శ్రీనివాస్, దూడయ్య పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లి విగ్రహం వద్ద భక్తుల పూజలు



బోనాలతో వస్తున్న మహిళలు



క్యూలో ఉన్న భక్తులు



ఎడ్ల బండిపై వస్తున్న ప్రజలు

రూ.20 లక్షలతో అభివృద్ధి చేస్తా

రూ.20 లక్షల నిధులతో కాకతీయుల నాటి పెద్దమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాయదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. తొలుత ఎడ్ల బండిలో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఏప్రిల్ 6న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైల్వే జంక్షన్‌కు అన్యాయం చేస్తే పోరాటమే

- సీపీఎం నేత ఎం.చుక్కయ్య

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్‌ను నిర్వీర్యం చేయడానికి కొంతమంది అధికారులు చేస్తున్న కుట్రపూరిత వ్యవహారాలను తిప్పికొట్టడానికి, ప్రజా ఉద్యమాలు నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు సీపీఎం నేత ఎం.చుక్కయ్య హెచ్చరించారు. కాజీపేట మండల పార్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ కేంద్రం ఏర్పాటును అడ్డుకోవడం కోసమే క్రూలింకులను విజయవాడకు తరలిస్తున్న విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులు గుర్తించాలన్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో కలిసి పోరాటాలకు పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. సమావేశంలో మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, కారు ఉపేందర్, సంటి రవి, మదన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

అన్ని మతాల సారమొక్కటే..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : అన్ని మతాల సారమొక్కటేనని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. హిందువులు, ముస్లింలు సోదరభావంతో మెలగాలని, ఉత్తమ జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరుల రంజాన్ ఉపవాస దీక్షలు కఠోరంగా ఉంటాయని చెప్పారు. క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. అన్ని కులాల, మతాల ప్రజల జీవనం ఉత్తమంగా ఉండాలన్నదే పండుగల ప్రాశస్త్యమని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని ముస్లిం సోదరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.



గీసుకొండలో పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు